ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 19 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళ) సా.6.22
సహారీ (బుధ) ఉ.4.48

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	26



అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, మండపేటలోని ఒక కేంద్రంలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా వున్న విద్యార్థులు

'పది' పరీక్షలు ఆరంభం

- జిల్లావ్యాప్తంగా తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతం
- 19,568 మందికి 19,121 మంది విద్యార్థుల హాజరు

ముమ్మిడివరం, మార్చి 18: పదో తరగతి పరీక్షలు జిల్లాలోని 112 కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు సంబంధించి ఎక్కడా ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. మొత్తం 19,568 మంది విద్యార్థులకు 19,121 మంది హాజరు కాగా 447 మంది గైర్హాజరయ్యారు. డీఈవో ఎం.కమలకుమారి ఆరు కేంద్రాలను, అసిస్టెంట్ కమిషనరు సురేష్ ఐదు కేంద్రాలను, డీవైఈవో ఎం.నరసింహ ఫణి ఆరు కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 27 కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగలేదని డీఈవో చెప్పారు.


రాయవరంలో హాల్ టిక్కెట్ నెంబర్లు చూసుకుంటూ...


అమలాపురంలో హాల్ టిక్కెట్ నెంబరు చూసి పంపిస్తున్న సిబ్బంది


కపిలేశ్వరపురంలో చివరి నిమిషంలో పరుగు పరుగున వస్తున్న విద్యార్థులు



మేమున్నామని....

సుఖంలోనే కాదు కష్టంలోనూ మీ వెన్నంటే ఉంటామని భరోసా ఇస్తున్నారు ఈ తల్లిదండ్రులు. పి.గన్నవరం హైస్కూల్లోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులైన కుంపట్ల వీర వెంకట సత్యనారాయణ, కేఎస్ ఎస్‌డీ చైతన్య, బద్దె రామ్‌చరణ్ పదో తరగతి చదువుతున్నారు. వారిని తల్లిదండ్రులు పరీక్ష కేంద్రానికి ఎత్తుకుని తీసుకొచ్చారు. కింది తరగతుల విద్యార్థులు సాయంతో పరీక్ష రాశారు.

...పి.గన్నవరం






కోనసీమ జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ఎంపిక ఆయా పార్టీల అధిష్ఠానాలకు ఇంతకు ముందెన్నడూ లేని రీతిలో సంక్లిష్టంగా మారాయి. అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఆయా పార్టీలు నిరంతరం కసరత్తు కొనసాగిస్తున్నప్పటికీ ఇంకా ఓ కొలిక్కిరాలేదు. కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ స్థానంతో పాటు అమలాపురం, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తి కాలేదు.



ఎవరికి దక్కేనో!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

- సంక్లిష్టంగా మారిన అమలాపురం లోక్‌సభ అభ్యర్థి ఎంపిక
- టీడీపీ అధిష్ఠానం పరిశీలనలో ముగ్గురి పేర్లు
- హరీష్‌మాధుర్, సత్యశ్రీ, రమేష్‌బాబుల్లో ఒకరికి అవకాశం
- లోక్‌సభ అభ్యర్థిని బట్టి అమలాపురం అసెంబ్లీ సీటు కేటాయింపు
- జనసేనకు పి.గన్నవరం కేటాయిస్తే అమలాపురం టీడీపీకే
- రాజోలులో జనసేన అభ్యర్థిని మారుస్తారా?
- ఉత్కంఠగా 'కోనసీమ' రాజకీయాలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని కీలక స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించినప్పటికీ కోనసీమ అభ్యర్థుల ఎంపికలో టీడీపీ, జనసేన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఆయా పార్టీల కేడర్లు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు, ఆత్మహత్యాయత్నాలు వంటివి చేయడం నిత్యకృత్యంగా మారాయి. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి ఎంపికను బట్టి అమలాపురం అసెంబ్లీ టిక్కెట్టు ఖరారు కావచ్చని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఎంపీ సీటుకు అమలాపురం లోక్‌సభ టీడీపీ ఇన్‌చార్జి, లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగి తనయుడు గంటి హరీష్‌మాధుర్, మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు తనయురాలు డాక్టర్ సత్యశ్రీ, పారిశ్రామికవేత్త డాక్టర్ యాతాటి రమేష్‌బాబు పేర్లు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. మంగళవారం లేదా బుధవారాల్లో రాష్ట్రంలోని లోక్‌సభ స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ప్రకటించే అవకాశముంది. గంటి హరీష్ మాధుర్ పేరు లోక్‌సభకు ఖరారైతే అమలాపురం అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా అయితాబత్తుల ఆనందరావు పేరు ప్రకటించవచ్చని విశ్వసనీయంగా తెలిసింది. లేనిపక్షంలో సత్యశ్రీ పేరు కూడా అధిష్ఠానం పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంది. సత్యశ్రీకి లోక్‌సభ టిక్కెట్ ఇస్తే అమలాపురం అసెంబ్లీ రేసులో హరీష్ ఉంటారని పరిశీలకులు భావిస్తున్నారు. అయితే అమలాపురంలో లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఆర్థికంగా అండగా ఉంటామని హామీ ఇచ్చిన నేపథ్యంలో పారిశ్రామికవేత్త యాతాటి రమేష్‌బాబు పేరును కూడా పార్టీ పరిశీలనలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అదే జరిగితే అమలాపురం అసెంబ్లీకి ఆనందరావు, హరీష్, సత్యశ్రీల్లో ఒకరిని ఖరారు చేసే అవకాశం ఉండొచ్చని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

పి.గన్నవరం అసెంబ్లీకి తొలుత టీడీపీ తరపున సరిపెల్ల రాజేష్ పేరును ప్రకటించారు. తన అభ్యర్థిత్వంపై వ్యతిరేకత రావడం, పార్టీకి నష్టం కలిగే అవకాశం ఉన్నందున పోటీ ఉంచి తానే వైదొలగుతానంటూ రాజేష్ ప్రకటించడం వంటి పరిణామాలతో పి.గన్నవరం అభ్యర్థిత్వం పెండింగులో పడింది. ఇప్పుడు ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించాలని నియోజకవర్గంలో ఒత్తిడి పెరిగింది. ఆ సీటు కోసం పోటీపడ్డ గిడ్డి సత్యనారాయణ పేరును జనసేన అధిష్ఠానం పరిగణలోకి తీసుకుని ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరించింది. ఇక తాజాగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో సరిపెల్ల రాజేష్ సోమవారం సాయంత్రం భేటీ అయినట్టు ప్రచారం జరగడంతో ఈ సీటు ప్రశ్నార్థకమైంది. జనసేనకు కేటాయిస్తారా లేక టీడీపీ అభ్యర్థిగా రాజేష్‌ను ప్రకటిస్తారా అనేది మిస్టరీగా మారడంతో అటు టీడీపీ, ఇటు జనసేన శ్రేణులు ఆందోళనలో ఉన్నారు. మరోవైపు పి.గన్నవరాన్ని తమకు కేటాయించాలంటూ బీజేపీ ఒత్తిడి తెస్తోంది. పి.గన్నవరాన్ని జనసేనకు కేటాయించే పక్షంలో అమలాపురం అసెంబ్లీ టిక్కెట్టు కచ్చితంగా టీడీపీకే కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ పి.గన్నవరం టీడీపీకి కేటాయిస్తే అమలాపురం జనసేనకు కేటాయించే సూచనల నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్లు తలలు పట్టుకుంటున్నాయి. ఈ స్థానాల కోసం జనసేన కేడర్ అమలాపురంలో గత కొన్ని రోజుల నుంచి ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఇదిలా ఉండగా రాజోలు అసెంబ్లీకి సీనియర్ ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్‌ను పేరును జనసేన ఖరారు చేసింది. దీంతో ఆయన వారం రోజులుగా నియోజకవర్గంలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అయితే ఆ నియోజకవర్గంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలను బేరీజు వేసుకున్న ఆ పార్టీ అధిష్ఠానం అభ్యర్థిని మార్చే ఆలోచనలో ఉన్నట్టు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతోంది. అధినాయకత్వం అభ్యర్థిని అధికారికంగా ఖరారు చేయకపోవడంతో రాజేశ్వరరావు వర్గం చేస్తున్న ప్రచారానికి బలం చేకూరుతోంది. ఏది ఏమైనా ఈ నియోజకవర్గంలో అభ్యర్థి ఎంపికలో జనసేన ఆచితూచి అడుగులు వేస్తోంది. దేవ వరప్రసాద్, బొంతు రాజేశ్వరరావులతో పాటు అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జిగా ఉన్న డీఎంఆర్ శేఖర్ పేరును కూడా జనసేన పెద్దలు పరిశీలనలోకి తీసుకున్నారని సమాచారం. గతంలో ఎంపీగా పోటీచేసి ఓటమి చెందిన డీఎంఆర్ శేఖర్‌కు ఆ ప్రాంతంలోని దళిత వర్గాల్లో కొంచెం పట్టు ఉంది. మొత్తం మీద ఇక్కడ రాజకీయం రసవత్తరంగా మారింది.


మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

సార్వత్రిక ఎన్నికల్లో అధికారులతో సమానంగా

మీడియా బాధ్యత

- పోలింగ్ శాతం పెంచే దిశగా మీడియా కృషి చేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

అమలాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో అధికారులతో సమానంగా మీడియా బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో మీడియా పాత్ర అత్యంత కీలకమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే దిశగా ప్రసార మాధ్యమాలు కృషి చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులతో సార్వత్రిక ఎన్నికలు-2024 నిర్వహణ తీరుపై డీఆర్వో ఆధ్వర్యంలో ఎంసీఎంసీ కమిటీ కన్వీనర్ డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ సమావేశం నిర్వహించారు. డీఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని మీడియా కేంద్రం ద్వారా అందిస్తామన్నారు. ఎన్నికల వార్తల సేకరణ నిమిత్తం మీడియా ప్రతినిధులకుపోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ద్వారా పాస్‌లు జారీ చేస్తామన్నారు. ఎన్నికల వార్తలను వాస్తవికతను ప్రతిబింబించేలా మాత్రమే రాయాలన్నారు. పెయిడ్ న్యూస్, అసత్య వార్తలు ప్రచురిస్తే ఎన్నికల సంఘం తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఎన్నికలకు సంబంధించి మీడియా ద్వారా ప్రసారంచేసే ప్రకటనలకు ముందుగా ఎంసీఎంసీ అనుమతులతో ధ్రువపత్రాలు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి కులం, మతం, జాతి, వర్గం, భాష ఆధారంగా ప్రజల మధ్య విద్వేషాన్ని పెంచే వార్తలను రిపోర్టింగు చేయకూడదన్నారు. పోలింగ్ శాతం పెంచే దిశగా మీడియా కీలక భూమిక పోషించాలన్నారు. డీఐపీఆర్వో లక్ష్మీనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ఓటర్లను చైతన్యపరిచేందుకు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు మీడియా మద్దతుగా నిలిచి ప్రచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల నియమావళి, సీ-విజిల్ యాప్‌లపై జిల్లా నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర్‌ప్రసాద్ అవగాహన కల్పించారు. అమలాపురం లోక్‌సభ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి, సోషల్ మీడియా ఎక్స్‌పర్ట్, ఎల్‌డీఎం కె.శ్యామ్‌బాబు, మెట్టి గౌరీశంకరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 18 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు... 7లో



ఇరుసుమండలో జరిగిన సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు, మొసలపల్లిలో వైసీపీ కార్యక్రమంలో సీఎం జగన్‌కు జై కొడుతున్న వలంటీర్లు

మేమూ 'సిద్ధం'

వైసీపీ కార్యక్రమాల్లో వలంటీర్లు

అంబాజీపేట, మార్చి 18: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ, రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు కూడా జారీ చేశారు. అయినప్పటికీ కొందరు వలంటీర్లు ఏమాత్రం పట్టించుకోవట్లేదు. అంబాజీపేట మండలం మొసలపల్లి, ఇరుసుమండల్లో 'సిద్ధం' పేరిట వైసీపీ నాయకులు సోమవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాలకు చెందిన వలంటీర్లు పాల్గొని అత్యుత్సాహం ప్రదర్శించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్‌తో పాటు ముఖ్య నేతలు వైసీపీ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహిం చారు. పార్టీ రూపొందించిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరుతూ ఓటర్ల జాబితాతో ఉన్న 'సిద్ధం' బ్యాగ్‌లను బూత్ కన్వీనర్లకు అందించారు. ఇరుసుమండ సమావేశంలో పది మంది, మొసలపల్లి సమావేశంలో 8 మంది వలంటీర్లు పాల్గొన్నారు. కాగా వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలను ప్రలోభపెట్టే అవకాశముందని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. అంబాజీపేట మండలం వాకలగరువు, తొండవరం గ్రామాల్లో వైసీపీ పి.గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహిం చిన 'సిద్ధం' సభలో వాకలగరువుకు చెందిన ఒక వలంటీరు పాల్గొన్నాడు.


అంబాజీపేట మండలం వాకలగరువులో జరిగిన సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్

పొలాలు బీటలు వారుతున్నాయి

సాగునీరు అందించి పంటలను కాపాడాలని రైతుల వినతి

అమలాపురం రూరల్, మార్చి 18: అమలాపురం మండల పరిధిలోని ఎ.వేమవరప్పాడు, భట్నవిల్లి, కామనగరువు గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు అందకపోవడంతో బీటలు వారుతున్నాయని రైతులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. సిరిపల్లి-అమలాపురం పంట కాల్వద్వారా ఇరవై రోజుల క్రితం సాగునీరు అందించారన్నారు. మళ్లీ ఇంతవరకు నీరందక ఆయా గ్రామాల పరిధిలోని సుమారు 250 ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని వివరిస్తూ వరి దుబ్బులను ప్రదర్శించారు. వెంటనే సాగునీరు అందించి పంటలను కాపాడాలని వేడుకున్నారు. రైతులు బద్దే రామకృష్ణ, కన్నిపాములు సత్యనారాయణ, వాసంశెట్టి వీర వెంకట సత్యనారాయణ, యిళ్ల ఉమామహేశ్వరరావు, కేతా శ్రీను, పెండెం రామప్రసాద్, యిళ్ల శేఖర్, యిళ్ల సూర్యారావు, తిరుకోటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట వరి దుబ్బులతో నిరసన తెలుపుతున్న రైతులు

రూ.15 లక్షల మేర అవకతవకలకు పాల్పడ్డ

ఆర్‌పీపై చర్యలు తీసుకోవాలి



అమలాపురం టౌన్, మార్చి 18: రామచంద్రపురం పురపాలక సంఘ పరిధిలోని అల్లా రసూల్ స్లమ్ లెవెల్ ఫెడరేషన్‌లో పనిచేస్తున్న ఆర్పీ రూ.15 లక్షల మేర అవకతవకలకు పాల్పడిందంటూ పలు సంఘాల మహిళలు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఎన్నికల కోడ్ అమలు కారణంగా 'స్పందన' రద్దు చేయడంతో అక్కడ ఏర్పాటుచేసిన అధికారికి ఎస్ఎల్ఎఫ్ సభ్యుల బృందం అర్జీ అందజేసింది. ఎస్ఎల్ఎఫ్ గ్రూపుల నుంచి ఫోర్జరీ సంతకాలతో మోసం చేసి ఆర్పీ సొమ్ములు స్వాహా చేసినట్టు ఆరోపించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో రజియా ఎస్కే. నూర్జహాన్, సయ్యద్ హమీదున్నీసా, ఎస్కే. రోషిణి, ఎండీ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్ స్వాహాపై అర్జీ



అమలాపురం టౌన్, మార్చి 18: కొత్తపేట మండలం మోడేకుర్రు సువర్ణజ్యోతి డ్వాక్రా సంఘ సభ్యురాలైన దాసరి రాజేశ్వరి యానిమేటర్‌గా పనిచేస్తూ సంఘానికి సంబంధించి రూ.5లక్షల నిధులు స్వాహా చేసినట్టు ఆరోపిస్తూ సంఘ సభ్యులు కలెక్టరేట్‌లో అందించారు. ప్రతి నెలా రూ.25,500 చొప్పున బ్యాంకుకు చెల్లించాల్సిన మొత్తాన్ని 18 నెలలుగా యానిమేటర్ రాజేశ్వరికి అందజేశామని, ఆ సొమ్మును బ్యాంకుకు జమ చేయలేదన్నారు. రూ.50వేలు ఉన్నతి రుణాన్ని సంఘం తరపున తీసుకుందని, మొత్తం రూ.5లక్షల మేర స్వాహా చేసిన వ్యవహారంపై డ్వాక్రా పీడీకి ఫిర్యాదు చేసినాపట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి సంఘ సభ్యులకు న్యాయం చేయాలని మర్రి అనంతలక్ష్మి, మంగం దుర్గ, గన్నవరపు పళ్లాలమ్మ, కవల నర్సమ్మ వేడుకున్నారు.


అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి సోమశేఖరరావు

'జవాబు పత్రాలను శ్రద్ధగా మూల్యాంకనం చేయాలి'

అమలాపురం టౌన్, మార్చి 18: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జవాబు పత్రాలను శ్రద్ధగా మూల్యాంకనం చేయాలని స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు ఆఫీసర్, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి వనుము సోమశేఖరరావు సూచించారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎగ్జామినర్, చీఫ్ ఎగ్జామినర్, స్క్రూటినైజర్లు, అధ్యాపకులకు ఆయన అవగాహన కల్పించారు. సంస్కృతం పేపర్ల మూల్యాంకనాన్ని ఈ నెల 9న ప్రారంభించామన్నారు. ఒక అసిస్టెంట్ ఎగ్జామినర్ రోజుకు 30 జవాబు పత్రాలను దిద్దాల్సి ఉంటుందన్నారు. మూల్యాంకన విధానాలపై ప్రిన్సిపల్స్ ఎస్వీ మంగారం, పి.గోపాలకృష్ణ, ఎం.రామారావు, కవల కోటిలింగం, పీయూఎన్ఎస్‌సీహెచ్ రాజు, పద్మశ్రీ పలు సూచనలు చేశారు.

దృఢమైన ప్రజాస్వామ్యానికి

ఓటు తప్పనిసరి

స్వీప్‌లో భాగంగా రేపటి నుంచి పలు పోటీలు

అమలాపురం టౌన్, మార్చి 18: దృఢమైన ప్రజాస్వామ్యానికి ఓటు తప్పనిసరిగా వేయాలని సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఎంఏకే భీమారావు కోరారు. స్వీప్‌లో భాగంగా ఓటర్లు, యువ ఓటర్లను చైతన్యపరిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వారువెల్లడించారు. సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో అమలాపురం మండల విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈవోలు జి.సూర్యప్రకాశం, సరెళ్ల దుర్గాదేవి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లావ్యాప్తంగా ఓటర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 20న పతంగుల పండుగ, 21న రంగోలి పండుగ, 23న ట్రై సైకిల్ పోటీలు జరుపుతామని వెల్లడించారు.


చింతలూరు నూకాంబిక జాతరపై కొత్తపేట ఆర్డీవో సమీక్ష ...7లో



నేటి నుంచి కోరుకొండ తీర్థం

కోరుకొండ, మార్చి 18:

భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవానికి శుభ ఘడియలు రానే వచ్చాయి. కోరుకుండ తీర్థం మంగళవారంతో ప్రారంభమవుతోంది. పాల్గుణ శుద్ధ చవితి మంగళవారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యే స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 25వ తేదీ సోమవారం శ్రీ పుష్పయాగంతో పరిసమాప్తం కానున్నాయి.



చురుగ్గా ఏర్పాట్లు

ఆరురోజులు పాటు అంగరంగ వైభవంగా సాగే శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు కోసం అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఎస్‌పీ రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకూడదని అన్ని ప్రభుత్వ శాఖలు, ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ, గ్రామపెద్దలు, సహాయ సహకారాలతో సమన్వయం చేసుకుని స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇప్పటికే అధికారులను కోరారు. ప్రతి రోజు వైదిక, వేద, శాస్త్ర, విద్వ గోష్ఠి, ధార్మిక, సంగీత, సాంస్కృతిక, జానపద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తరలిరానున్న భక్తులు

రాష్ట్రం నలుమూలల నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా కోరుకొండ తీర్థానికి భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయంగా ఉన్న కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించాలని అన్నవరం దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఐవీ రోహిత్ అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం పుట్టమన్ను తెచ్చుట. అంకురార్పణ, ధ్వజారోహణం, గ్రామ బలిహరణ, సేవాకాలంతో స్వామి వారి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగరాజభట్టర్ స్వీయ పర్యవేక్షణలో వైకానస ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక అర్చకస్వాములు పెదపాటి, పెద్దింటి, పెరవలి వార్ల స్వీయ పర్యవేక్షణలో పాంతాయ్నిక దీక్షతో ఈ వైకానస, ఆగమ, శ్రీ వైష్ణవ సాంప్రదాయక స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం లోక కల్యాణార్థం, భక్తజన సంరక్షణార్థం జరిపించనున్నారు.



స్వామి వారి ఆవిర్భావం

స్వామి వారు కృతయుగంలో వెలిసినట్లు వేద ప్రమాణం. 11వ శతాబ్ద కాలంలో వెలుగులోకి వచ్చినట్లు ఇక్కడ శిలాశాసనం తెలియజేస్తున్నాయి. స్వామి వారిని వ్యాస మహర్షి తండ్రి పరాసర మహర్షి అర్చించి తపస్సు చేసి సిద్ధి పొందారు. అందుకే కోరుకొండకు పరాసర గిరి అని పేరు వచ్చింది. ద్వాపర యుగంలో పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు ఈ కొండ వెనుక ఉన్న కొండ గృహల్లో తపస్సు చేసుకుంటూ ప్రతి నిత్యం నరసింహ స్వామిని అర్చించేవారని పురాణ గాథలు చెబుతున్నాయి. కాలక్రమేణా ఇది కోరుకొండగా ప్రసిద్ధి చెందింది. ధాన్యపు రాశి వలే కోరుగా ఉండే కొండపై స్వామి వెలిశారు కాబట్టి ఈ కొండకు కోరుకొండ అని పేరు వచ్చింది. 600లకు పైగా మెట్లు భక్తితో ఎక్కి స్వామి వారిని దర్శనం చేసుకుంటే భక్తులు కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రతీక. ప్రస్తుతం ఇక్కడ కొండపైన ఏక కాలార్చన జరుగుతుంది. అదే విధంగా కోరుకొండపై స్వామి వారు స్వయంభూగా వెలిచారు. కోరుకొండ కొండకు సువర్ణగిరి, వేదాద్రి, పరాసర శైలము, పారిజాత గిరి అనే పేర్లు కూడా ఉన్నాయి. స్వామి వారి కొండ చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉంది. భారతదేశంలో అరుణాచలం తర్వాత ప్రతినిత్యం కోరుకొండ కొండ చుట్టూ భక్తులు 3 సార్లు గిరి ప్రదక్షిణ చేస్తే కోర్కెలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. ప్రతి సంవత్సరం స్వామి వారి కల్యాణ మహోత్సవానికి 10 రోజులు ముందు 200 మంది భక్తులు నరసింహ మాల ధరించి ఉదయం, సాయంత్రం గిరి ప్రదక్షిణ చేస్తారు.

స్వామి వారి చరిత్ర

మంచి కొండ రెడ్డిరాజు క్రీ.శ 1325- 1395 మధ్య కోరుకొండను రాజధానిగా చేసుకుని 70 ఏళ్ల పరిపాలించారు. ఆ సమయంలోనే కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయం దివ్య క్షేత్రంగా విరాజిల్లింది. 1340-1370 మధ్య రాజుగా ఉన్న ముమ్మిడి నాయకుడు శ్రీరంగంలోని శ్రీ వైష్ణవ గురువుల శిష్యత్వం చేసి శ్రీరంగం నుంచి కోరుకొండకు పరానర భట్టర్ వంశీకులను తీసుకొచ్చారు. స్వామి వారి కైంకర్యాలు చేసేందుకు తీసుకొచ్చారు

ఆలయ నిర్మాణం

ముమ్మిడి నాయకుడు భార్య లక్ష్మీదాసి గొప్ప వైష్ణవ భక్తురాలు. ఆమె క్రీస్తు శకం 1353 విజయ సంవత్సరం పాల్గుణ శుద్ధ దశమి గురువారం రోహిణి నక్షత్రంలో కొండపైన దేవాలయం నిర్మాణం చేశారు. సుమారు 10 సెంట్లు వైశాల్యం గల కోరు కొండ కొండ శిఖరంపైన ఈ దేవాలయం నేటికి చెక్కుచెదరకుండా ఉంది. కొండదిగువున మరొక పెద్ద దేవాలయం నిర్మించారు.


కొండ దిగువున స్వామివారి పాదాలు

కల్యాణ మండపాలు

1353లో ముమ్మిడి నాయకుడు స్వామికి కొండపైన, కొండ దిగువున రెండు పురాతన రాతి కల్యాణ మండపాలు నిర్మించారు. స్వామి వారికి భూదానాలు, గ్రామదానాలు ఇచ్చారు. కోరుకొండ గ్రామాన్ని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి సర్వ అగ్రహారంగా ప్రకటించారు. అదే విధంగా 1100 ఎకరాల భూమిని 72 మందికి నౌకరీ ఈనం భూముల కింద ఇచ్చారు. అవి కాకుండా లక్ష్మి దాసి స్వామి వారికి నిత్యధూపదీప నైవేద్యాలకు, పూజా ఉత్సవాలకు రెండు గ్రామాలు 300 ఎకరాల భూమిని దానం ఇచ్చారు. వాటికి 1864లో ఈనం కమిషనర్ పట్టాలు ఇచ్చారు. దాంతో ఆ భూములన్ని పట్టాలు పొందిన వారు అమ్ముకుని వారిలో చాలా మంది నేడు స్వామివారికి సేవలు చేయడం తగ్గించారు. స్వామి వారి భూములన్ని ఎహ్డేట్ అండ్ ఎబాస్‌మెంట్ యాక్ట్ ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం స్వామి వారికి 15 ఎకరాల భూమి మాత్రమే మిగిలింది. స్వామి వారి నిత్య దీప ధూప నైవేద్యాలు చేయడం కూడా కష్టంగా ఉన్న నేపథ్యంలో సుమారు 12 సంవత్సరాలు క్రితం కోరుకొండ దేవస్థానాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుంది.

కిక్ బాక్సింగ్‌లో కాంస్యం


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, ఇతర అధికారులు

దివాన్‌చెరువు, మార్చి18: అఖిల భారత విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థి సీహెచ్ దినేష్ కాంస్య పతకం సాధించినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సోమవారం తెలిపారు. మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో నన్నయ అనుబంధ కళాశాలైన రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న దినేష్ 81 కిలోల విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దినేష్‌కు కాంస్య పతకాన్ని వీసీ అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, క్రీడా బోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, కల్నల్ సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ బి.మధుకుమార్, రాజోలు కళాశాల ఇంగ్లీషు లెక్చరర్ ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య




శ్రీకాంత్

ఆత్రేయపురం, మార్చి 18: బీటెక్ చదివినా ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ యువకుడు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడుమిల్లికి చెందిన నల్లి శ్రీనివాస్-అనంతలక్ష్మి దంపతులకు ఏకైక కుమారుడు శ్రీకాంత్‌కుమార్ (23). తండ్రి శ్రీనివాస్ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తల్లి అనంతలక్ష్మి కువైట్‌లో ఉంటూ కుటుంబాన్ని పోషిస్తూ కుమారుడిని బీటెక్ వరకు చదివించింది. ఉద్యోగ ప్రయత్నాలతో విసిగివేసారిన కుమార్ ఆదివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రికి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. శ్రీకాంత్‌కుమార్ మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

24 నుంచి స్వామివారి ఆర్జిత సేవ

అన్నవరం, మార్చి 18: అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణస్వామివారి దేవస్థానం నందు ఈనెల 24 నుంచి ప్రతీ ఆదివారం స్వామివారి రథసేవ, ఆర్జిత సేవ జరుగతుంది. రథసేవలో భాగంగా స్వామి, అమ్మవార్లు ప్రాకార మండపం చుట్టూ ప్రదక్షిణ చేయు సేవలో పాల్గొనే భక్తుల టిక్కెట్ రుసుమును రూ.2500లుగా నిర్ణయించారు. రథసేవ నందు పాల్గొనే భక్తులకు రథయాత్ర ప్రారంభంలో గోత్ర నామాలతో సంకల్పం చెప్పి కండువా, రవికతో పాటు రెండు ప్రసాదం ప్యాకెట్లు అందిస్తారు. రథయాత్ర పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు శ్రీస్వామి అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం అందిస్తారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం అధికారులు కోరారు.

చింతలూరు జాతరపై అధికారుల సమీక్ష

అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచన


సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

ఆలమూరు, మార్చి 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతర, ఉత్సవాలను అధికారులు, స్థానికులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ సూచించారు. ఏప్రిల్ 7 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం ఆయన ఆలమూరు రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జాతరకు వేలాదిగా భక్తులు తరలి రానున్న దృష్ట్యా వారికి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి దృష్ట్యా చంటి పిల్లలకు ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు వేయించాలని సూచించారు. ఏప్రిల్ 7న ప్రధాన జాతర, 8న తీర్థం, 9న జాతర మహోత్సవంతో పాటు నెల రోజులు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులతో ఆలమూరులో సమీక్షించామని, వచ్చే సమావేశాన్ని చింతలూరులో నిర్వహిస్తామని ఆర్డీవో చెప్పారు. తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీవో మేరీరోజ్, రావులపాలెం సీఐ రామ్‌కుమార్, ఆలమూరు ఎస్‌ఐ శ్రీనునాయక్, నూకాంబికా దేవస్థానం ఈవో ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డెయిరీ ఫుడ్స్‌లో అధికారుల తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

దివాన్‌చెరువు, మార్చి 18: దివాన్ చెరువులోని సంతోష్‌నగర్‌లో బాబా డెయిరీ ఫుడ్స్ షాపులో విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్, మెట్రాలజీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు కలసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఆ డైరీ ఫుడ్స్‌కు ప్యాకింగ్ లైసెన్సు లేకపోవడం, అవిన్ డ్రింక్రీమ్ 30ఎంఎల్ ప్యాకెట్స్‌పై మెండిటరీ డిక్లరేషన్ లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. అలాగే ట్రేడ్ లైసెన్సు పొందకపోవడంతో పంచాయతీ కార్యదర్శి రూ.2,204 అపరాధ రుసుము విధించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు డైరీ నుంచి కుల్ఫీ, మీడియం ఫ్యాట్‌ఫ్రోజన్ డెజర్ట్‌ల నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐస్‌క్రీమ్ తయారీదారులు, స్వీట్‌స్టాల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు వాటి పరిసరాలను, కిచెన్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అధికారులు ముత్యాలనాయుడు, భార్గవమహేష్, జగన్నాథరెడ్డి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


సాగర తీరంలో గుడారాలు ఏర్పాటు చేసుకున్న దృశ్యం

త్రివిధ దళాల విన్యాసాలకు
కాకినాడ తీరంలో ఏర్పాట్లు

సర్పవరం జంక్షన్, మార్చి 18: దేశ రక్షణ, భారత భూభాగం దురాక్రమణకు పాల్పడుతున్న ఉగ్రవాదుల నిర్మూలన, శత్రు దేశాలతో యుద్ధసమయంలో భారత త్రివిధ దళాలు నిర్వహించే త్రివిధ దళాల విన్యాసాల నిర్వహణకు నేవీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట సాగర తీరంలో నేవెల్ ఎన్‌క్లేవ్ వద్ద భారత త్రివిధ దళాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలు ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే విన్యాసాలు కోసం ఆ శాఖ ఉన్నతాధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. విశాఖ నుంచి ఆర్మీ వాహనాల్లో సిబ్బంది పలు ట్రూప్‌లతో సోమవారం బీచ్‌కు చేరుకుని గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. విన్యాసాల నిర్వహణ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. రెండు మూడు రోజుల్లో యుద్ధ ట్యాంకర్లు ఒకట్రెండు రోజుల్లో విన్యాసాల్లో పాల్గొనే వైమానిక దళం, యుద్ధ ట్యాంకర్లు ఇక్కడకు చేరుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విన్యాసాలు జరిగే సముద్ర తీరంలో పరిశుభ్రత, ప్రత్యేక శానిటేషన్ పనులను కార్యదర్శి వెంకటరత్నం ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బంది నిర్వహించారు.

లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు తీవ్రగాయాలు


భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త

రాజానగరం, మార్చి 18: జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెం సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురానికి చెందిన పిల్లి లోవకుమారి(40)_ భర్త దుర్గారావు అనారోగ్యం కారణంగా బైక్‌పై రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తున్న తరుణంలో మార్గమధ్యంలో తూర్పుగోనగూడెం సమీపంలో బైక్‌ను వెనుకవైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో లోవకుమారి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. దుర్గారావుకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలంలో భార్య మృతదేహం వద్ద దుర్గారావు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కలచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు



స్ట్రాంగ్ రూమ్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత

రంపచోడవరం, మార్చి 18: రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయసునీత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆమె ఎస్పీ తూహిన్‌సిన్హా, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి నియోజకవర్గానికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈవీఎంల భద్రత, ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, ఎన్నికల అధికారులకు వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై సూచనలు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ మోహన్‌రావు, డీటీలు సత్యనారాయణ, శివ, చైతన్య, విశ్వనాథం, సుబ్బారావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

త్వరలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు పటిష్ఠమైన చర్యలు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత చెప్పారు. ఎస్పీ తూహిన్ సిన్హా, సబ్ కలెక్టరు ప్రశాంత్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌లకు జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సంబంధించిన ఈవీఎంలను వేర్వేరుగా భద్ర పరచాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించి 25 కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 18 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు



ఆత్రేయపురం, మార్చి 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణం, తీర్థం, రథోత్సవాలను ఏప్రిల్ 18 నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం వివిధ శాఖల అధికారులతో తొలి విడత సమావేశం నిర్వహించనున్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

రెండున్నరేళ్ల చిన్నారితో సహా పది మందికి గాయాలు


చిన్నారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గోకవరం, మార్చి 18: గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో సోమవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఈ దాడిలో రెండున్నరేళ్ల చిన్నారి సహా 10 మందికి గాయాలయ్యాయి. బయట ప్రాంతం నుంచి గ్రామంలోకి ప్రవేశించిన ఓ పిచ్చికుక్క కనిపించిన వారిపై దాడి చేసుకుంటూ సంచరించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు భయంతో ఇళ్లల్లోకి పరుగుల తీశారు. ఆరు బయట ఉన్న పశువులను, కోళ్లను కూడా తీవ్రంగా గాయపర్చింది. గాయపడిన వారు గోకవరం ప్రభుత్వాసుపత్రికి పరుగుల తీశారు. తీవ్రంగా గాయపడిన చిన్నారిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చివరకు పిచ్చి కుక్కను గ్రామస్థులు హతమార్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా గ్రామంలో సుమారు 20కి పైగా వీధి కుక్కలను పిచ్చికుక్క కరవడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


కుక్క దాడిలో గాయపడిన చిన్నారి

ఈల పాటలతో అలరించిన మురళీ

యానాం, మార్చి 18: స్థానిక గాజులవారి వీధిలోని జీవీఎస్ పార్వతీశ్వ రమ్మ గార్డెన్‌లో ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన ఈలపాట గాయకుడు డాక్టర్ కొమరవోలు శివప్రసాద్ ఈల పాటలతో అలరించారు. 30దేశాలల్లో వందల ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు, రామ్మోహన్‌రావు, విళ్ల రెడ్డి నాయుడు, ఉంగరాల వెంకటేశ్వర రావు (బూరిబాబు), టీవీఎస్ ఎస్వీ ప్రసాదరావు,ప్రముఖులు పాల్గొన్నారు.

- జిల్లాలోని మండలాల్లో పరీక్షలు ప్రారంభం
- పరీక్షా కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీలు
- హాల్ టిక్కెట్ నెంబర్లు చూసుకునేందుకు క్యూలు

పదో తరగతి పరీక్షలు ప్రారంభం


ముమ్మిడివరం జడ్పీ బాలుర హైస్కూల్‌కు పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

ముమ్మిడివరం, మార్చి 18: పదో తరగతి పరీక్షలు ముమ్మిడివరంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం జరిగాయి. తెలుగు పేపర్‌కు సంబంధించి 733మందికి 722మంది హాజరు కాగా 11మంది గైర్హాజరయ్యారు. ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 164 మందికి 164మంది, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 168మందికి 168మంది, అయినాపురం జడ్పీ హైస్కూలులో 124మందికి 122మంది, అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 126మందికి 122మంది, గురుకుల పాఠశాలలో 151మందికి 146 మంది పరీక్షకు హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్.రామచంద్రరావు ఆధ్వర్యంలో అనతావరం, ముమ్మిడివరం జడ్పీ బాలుర, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో కేంద్రాలను పరిశీలించారు.

మండపేట: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండపేట పట్టణం, మండలంలో తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు రెగ్యులర్ విద్యార్థులు 1,863 మందికి 8మంది, ప్రైవేటు విద్యార్థులు 43 మందికి 12మంది హాజరుకాలేదు. 1866మంది పరీక్షలు రాశారని ఎంఈవో నాయుడు రామచంద్రరావు తెలిపారు.

అమలాపురం టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అమలాపురం మండల విద్యా శాఖ కార్యాలయం పరిధిలో అర్బన్, మండల పరిధిలోని 36ఉన్నత పాఠశాలల విద్యార్థులకు 11కేంద్రాలను ఏర్పాటుచేశారు. తొలి రోజు పరీక్షకు 2,149మంది విద్యార్థులకు 2118మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరు కాగా 98.05 శాతం నమోదనట్టు ఎంఈవో సూర్యప్రకాశం తెలిపారు.

కె.గంగవరం: పదో తరగతి పరీక్షలు తొలిరోజు సోమవారం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. దంగేరు, కె.గంగవరం, పామర్రు, కోటిపల్లి సెంటర్లలో 473మందికి 19మంది హాజరు కాలేదు. 454మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

పి.గన్నవరం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. నరేంద్రపురం, పి.గన్నవరం, ముంగండ, మానేపల్లి పాఠశాలల్లో పరీక్షలు రాశారు. 857మందికి 848 మంది హాజరయ్యారని 9మంది గైర్హాజరయ్యారని ఎంఈవో కె.హెలీనా తెలిపారు. పి.గన్నవరం హైస్కూల్లో షేక్ ఫాతియా, దేవరబోయిన సునీత పరీక్ష రాయడానికి రాకపోవడంతో ఉపాధ్యాయుడు నక్కా శ్రీనివాస్, పీడీ సాయిరాంలు అవగాహన కల్పించి పరీక్ష సెంటర్‌కు తీసుకువచ్చారు.

ఐ.పోలవరం: మండలంలో టెన్త్ పరీక్షలకు 702మంది హాజరైనట్టు ఎంఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఐ.పోలవరం జడ్పీ హైస్కూల్లో రెండు పరీక్షాకేంద్రాలు, మురమళ్ల హైస్కూల్, సాయిపబ్లిక్ స్కూల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 705మందిలో ముగ్గురు హాజరుకాలేదన్నారు.

కాట్రేనికోన: మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో కేటీటీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 532మంది పరీక్షకు రావాల్సివుండగా పది మంది హాజరుకాలేదన్నారు.

మలికిపురం: పదో తరగతి పరీక్షలు మలికిపురం ఏఎఫ్‌టీడీ ఏ, బీ సెంటర్లు, విశ్వేశ్వరాయపురం, బట్టేలంక, కేశనపల్లిలో పరీక్షలు జరిగాయి. ఐదు సెంటర్లలో 876మందికి 16మంది గైర్హాజరైనట్టు ఎంఈవో ఎం.విజయశ్రీ తెలిపారు. ఇంగ్లీషు మీడియంలో 538మందికి 538మంది, తెలుగు మీడియంలో 238మందికి 222మంది హాజరయ్యారు.

అల్లవరం: మండలంలోని అల్లవరం, దేవగుప్తం, కొమరగిరిపట్నం కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 622 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 31మంది గైర్హాజరయ్యారని ఎంఈవో కె.కిరణ్‌బాబు తెలిపారు.

ఆత్రేయపురం: మండలంలో 558మంది విద్యార్థులకు 14 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో పీవీ ప్రసాదరావు తెలిపారు. ర్యాలిలో 203, ఆత్రేయపురంలో 181, పేరవరంలో 160మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, చల్లపల్లి, భీమనపల్లి, ఎస్.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలకు ఉత్సాహంగా హాజరయ్యారు. కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. 4కేంద్రాల్లో 617మందికి 11మంది గైర్హాజరైనట్టు ఎంఈవో సత్తి సత్యకృష్ణ తెలిపారు.

రాయవరం: రాయవరంలో రెండు పరీక్షా కేంద్రాలు, పసలపూడి, చెల్లూరు పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. 732విద్యార్థులకు 21మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు తొలుత వివిధ ఆలయాలను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద హాల్ టిక్కెట్ నెంబర్లు చూసేకునేందుకు క్యూకట్టారు.

రాజోలు: రాజోలు జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, శివకోటి, పొన్నమండ, కడలి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. మండలంలో 833మందికి 794మంది హాజరయ్యారని, 39మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో ఎస్.మనోహరం తెలిపారు.

కపిలేశ్వరపురం: అంగర, కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాలను రామచంద్రపురం డీవైఈవో ఎస్.నరసింహపణీంద్ర, ఎంఈవో కె.తాతారావు, బృందం తనిఖీలు నిర్వహించాయి. పరీక్షా కేంద్రాలను అంగర ఎస్ఐ ఎ.పరదేశి పరిశీలించారు. అంగర ఏబీసెంటర్లలో 334మందికి 331మంది, కపిలేశ్వరపురం కేంద్రంలో 126మందికి 125మంది పరీక్షకు హాజరైనట్టు పరీక్షాకేంద్రాల సీఎస్‌లు, డీవోలు తెలిపారు.

రావులపాలెం: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 1,171మందికి 38మంది గైర్హాజరు కాగా 1133 మంది పరీక్షలు రాసినట్టు ఎంఈవో శ్రీనివాసరాజు తెలిపారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. కేశవదాసుపాలెం, మోరి, సఖినేటిపల్లి సెంటర్లలో పకడ్బందీ ఏర్పాట్లతో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు.

అంబాజీపేట: అంబాజీపేటలో 143మంది 142మంది, తొండవరంలో 159మందికి 158మంది, పుల్లేటికుర్రులో 188 మందికి 187మంది హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరయ్యారని ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు.

ద్రాక్షారామ: రామచంద్రపురం పట్టణం, మండలంలో 51 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. 1,702మందికి 1,651మంది పరీక్ష రాశారు. మండలంలో తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు జరిగినట్టు ఎంఈవో ఎం.శ్రీనివాస్ తెలిపారు.

మామిడికుదురు: మండలంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 12ప్రభుత్వ పాఠశాలలు, ఐదు ప్రైవేటు పాఠశాలలకు చెందిన1100మందికి 1068మంది హాజరయ్యారు. మామిడికుదురు, అప్పనపల్లి, లూటుకుర్రు, మొగలికుదురు, పాశర్లపూడి, మొగలికుదురులోని ఓ ప్రైవేటు స్కూలు, ఈదరాడ హైస్కూళ్లను కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన పరీక్షలో 32 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు.

కొత్తపేట: మండలంలో 934 మంది విద్యార్థులకు 32 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో ఎం.హరిప్రసాద్ తెలిపారు.

టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేదిలేదు: వేగుళ్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మార్చి18:మండపేట నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల బెదిరింపులకు టీడీపీ శ్రేణులు భయపడే ప్రసక్తేలేదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే ఎంతటివారైనా సరే గట్టిగా బుద్ధిచెబుతామన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీలో చేరే వారిని బెదిరించడం, దౌర్జన్యాలకు వైసీపీ కార్యకర్తలు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. టీడీపీలో చేరుతున్న వారిని వైసీపీ శ్రేణులు భయభ్రాంతులకు గురిచేస్తున్న విషయాలు తన దృష్టికి వస్తున్నాయన్నారు. వైసీపీ నేతలు తప్పుడు రాజకీయాలు చేస్తే దెబ్బకు దెబ్బతీస్తానన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. సీఎం జగన్ పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా వున్నారన్నారు. పార్టీ నాయకులు, టీఎస్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, మాజీ కౌన్సిలర్ బండి గోవిందు, కొవ్వాడ అప్పన్నబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా


మాట్లాడుతున్న ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

అమలాపురం టౌన్, మార్చి 18: మోదీ కూటమిని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేయలేదని, పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయలేదని విమర్శించారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకపోవడం వల్ల ఏపీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. రాష్ట్రంలోను, కేంద్రంలోను కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే రాష్ట్రానికి ప్రత్యేకహోదా లభిస్తుందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 46మంది అభ్యర్థులు, పార్లమెంటు స్థానానికి నలుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. త్వరలోనే నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాసరావు, ముషిణి రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శులు అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శ్రీమన్నారాయణ, పీసీసీ అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, వంటెద్దు బాబి, కుడుపూడి శ్రీనివాసరావు, రాయుడు వెంకటరమణ, రాయుడు గంగాభవానీ, మహబూబ్ షకీలా పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ఆదేశాలే శిరోధార్యం: లీలాకృష్ణ


మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ

మండపేట, మార్చి18: రాజకీయంగా తగిన ప్రాధాన్యం, గుర్తింపు ఇవ్వాలని, కార్యకర్తల అభిప్రాయాలను పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు వివరించిన తర్వాత ఆయన ఆదేశాల మేరకు తాను కూటమితో పనిచేసే అంశంపై తుది నిర్ణయం తీసుకుంటానని జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన జనసైనికులతో అంతర్గత సమావేశం నిర్వహించారు. తొలుత ఆయన విలేకరులతో మాట్లాడారు. మండపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తాను, జనసైనికులు ఎంతగానో శ్రమించామన్నారు. స్థానికసంస్థల ఎన్నికలు, ఇతర అంశాలపై పవర్ షేరింగ్ వంటి అంశాలపె జనసైనికులు భరోసా కోరుతున్న నేపథ్యంలో మరోసారి జనసైనికులతో సమావేశమై నిర్ణయాన్ని వెల్లడిస్తానన్నారు. జనసేన నాయకులు నామాల చంద్రరావు, వల్లూరు సర్పంచ్ దాసి మీనాకూమారి, జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి దాల పర్తి శ్రీనివాస్, పార్టీ మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల అధ్యక్షులు కుంచే దుర్గాప్రసాద్, తుత్తుపు నాగ రాజు, వల్లూరి సత్యప్రసాద్, ఉండమట్ల రామారావు పాల్గొన్నారు.

సుభాష్ గెలుపునకు కృషి చేయాలని తీర్మానం


కె.గంగవరంలో సమావేశమైన తెలుగుదేశం పార్టీ నాయకులు

కె.గంగవరం, మార్చి 18: టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గం అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ గెలుపునకు కృషి చేయాలని పార్టీ మండల కమిటీ తీర్మానించింది. కె.గంగ వరంలో పార్టీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని పలుగ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. సుభాష్ గెలుపునకు ప్రతీకార్యకర్త 55రోజులు శకివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మాజీ జడ్పీటీసీ మేడి శెట్టి రవి కుమార్, దంగేరు మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి, శేరెడ్డి సత్తిబాబు, జగతా రమణ, శేరిలంక మాజీ సర్పంచ్ అప్పారావు, రిమ్మలపూడి సుమన్ పాల్గొన్నారు.

బండారుకు యువత మద్దతు


బండారును కలిసి మద్దతు తెలుపుతున్న టీడీపీ, జనసేన యువత

కొత్తపేట, మార్చి 18: కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావుకు మోడేకుర్రు శివారు రాకూర్తివారిపాలేనికి చెందిన టీడీపీ, జనసేన యువకులు మద్దతుగా నిలిచారు. సోమవారం వారు వాడపాలెంలోని బండారు స్వగృహానికి వచ్చేసి తమ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో మీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. వారిని సత్యానందరావు సాదరంగా ఆహ్వానించి తనను గెలిపించాలన్నారు.

ఇఫ్తార్ విందులో బండారు



ఆలమూరు, మార్చి 18: నర్సిపూడి మసీదు వద్ద సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ముస్లింలకు మొదటి నుంచీ అండగా నిలుస్తున్న టీడీపీకే తాము మద్దతు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో నూర్ సుభాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

బి.దొడ్డవరంలో తాచుపాము హల్‌చల్

మామిడికుదురు, మార్చి 18: బి.దొడ్డవరంలోని చింతపల్లి శ్రీను ఇంటికి సమీపంలోని ఇటుకుల గుట్టలోకి సోమవారం ఐదు అడుగుల తాచుపాము వెళ్లి బుసలు కొట్టడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పనపల్లి గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ యాళ్ల ప్రకాశరావు దానిని సంచిలో బంధించి జనసంచారం లేని ప్రాంతంలో విడిచిపెట్టాడు.

బాడీబిల్డింగ్ అసోసియేషన్ క్రమశిక్షణా సంఘం చైర్మన్‌గా వెంకన్నాయుడు


వెంకన్నాయుడును సత్కరిస్తున్న సభ్యులు

అమలాపురం టౌన్, మార్చి 18: బెంగళూరులో జరిగిన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా వంటెద్దు వెంకన్నాయుడును ఎన్నకున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి రమేష్ నుంచి సోమవారం ఉత్తర్వులు వచ్చాయి. కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకన్నాయుడును ఘనంగా సత్కరించారు. క్రీడాకారులను తగిన విధంగా ప్రోత్సహించడంతో పాటు యువతను క్రీడల పట్ల ఆకర్షితులు చేసేవిధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, యాళ్ల బాబి, అరిగెల నాగబాబు, కుంపట్ల గోపి, పొణకల దుర్గాప్రసాద్, ముత్యాబత్తుల వెంకటరమణ, కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

అల్లవరం, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అల్లవరం, గోడితిప్ప, బోడసకుర్రు గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్, సీఐఎస్ఎఫ్ కమాండర్ ఎ.అన్నయ్యదొర ఆధ్వర్యంలో సాయిధ బలగాలు కవాతు చేశాయి.





పోలీసుల తనిఖీలు

అంబాజీపేట, మార్చి18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంబాజీపేట, గంగలకుర్రు మలుపు వద్ద ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో కార్లు, వివిధ వాహనాలను సీఐఎస్ఎఫ్ పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఏఎస్ఐ సూర్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

సింహ వాహనంపై వెంకన్న ఊరేగింపు



యానాం, మార్చి 18: యానాం శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి (యానాం వెంకన్న) కల్యాణమహోత్సవాల్లో భాగంగా సోమవారం సింహ వాహనంపై స్వామివారు ఊరేగారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సింహ వాహన సేవను నిర్వహించి స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఖండవల్లి రామకృష్ణ, హంసాని రామలక్ష్మణుడు, ఉత్సవాదారులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్లు పంపిణీ చేసిన వలంటీర్లు

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

అల్లవరం, మార్చి 18: దేవగుప్తం పంచాయతీ పరిధి నల్లగుంట తదితర ప్రాంతాల్లో వలంటీర్లు జగన్ స్వచ్ఛ సంకల్పం పేరిట ఇంటింటికీ రెండు ప్లాస్టిక్ బుట్టలను అందజేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు చెప్పారు. విషయం తెలుసుకున్న కార్యదర్శి గ్రామంలోకి వెళ్లి ఎందుకు పంపిణీ చేశారంటూ వలంటీర్లను ఆరా తీశారు.

ఆర్డీవో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

అల్లవరం, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడూరుపాడులో ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహిస్తున్న తనిఖీలను అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు బి.సునీల్‌కుమార్, ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, రెవెన్యూ సిబ్బంది వున్నారు.

తూర్పులంకలో పైపులైన్ లీకేజీ

అల్లవరం, మార్చి 18: తూర్పులంకలో ఆర్‌డబ్ల్యుఎస్ మంచినీటి పైపులైను శనివారం పాడైంది. ఆదివారం మరమ్మతులు చేసినా తిరిగి లీకైంది. ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది మరోసారి బాగుచేసి లీకేజీని అదుపుచేశారు.

రాష్ట్ర ప్రయోజనాలు కోసమే బీజేపీకి మద్దతు

టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి హుస్సేన్


మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ముఖ్రం హుస్సేన్


మామిడికుదురు, మార్చి 18: రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీకి టీడీపీ బహిరంగ మద్దతు ప్రకటించిందని, దీనిని ముస్లిం సోదరులు గమనించాలని టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ముఖ్రం హుస్సేన్ అన్నారు. నగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మతతత్వ పార్టీతో టీడీపీ పొత్తు పెట్టుకుందని వ్యతిరేకిస్తున్న ముస్లిం మైనార్టీ వర్గాలు నిజాలు తెలుసుకోవాలన్నారు. షాదీఖానాలు, కమ్యూనిటీ సెంటర్లు, సబ్సిడీ రుణాలు, చంద్రన్న బీమాలు తదితర పథకాలన్నీ టీడీపీలోనే అమలయ్యేవని, వాటిని గుర్తెరిగి మైనార్టీలు నడుచుకోవాలన్నారు. కావున మైనార్టీలు టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి గవర్నర్ రాజీనామా

ఎంపీగా పోటీ చేసే అవకాశం

యానాం, మార్చి 18: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, తెలంగాణ గవర్నర్ పదవులకు తమిళసై రాజీనామా చేశారు. ఈమేరకు లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. దీంతో రాష్ట్రపతి రాజీనామాను ఆమోదించారు. పుదుచ్చేరి, తమిళనాడులో ఏదో ఒక స్థానం నుంచి లోక్‌సభకు పోటీచేస్తారని ప్రచారం.

బీజేపీ సహ కన్వీనర్‌గా గోవిందరావు



రావులపాలెం,మార్చి18: ఈతకోటకు చెందిన గంధ్రోతు వీర గోవిందరావు కొత్తపేట అసెంబ్లీ బీజేపీ సహ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజాగళం విజయవంతం.. జగన్ దుష్ట పాలనకు అంతం

రాజోలు, మార్చి 18: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరి పేటలో జరిగిన ప్రజాగళం మహాసభ విజయవంతం కావడం జగన్ దుష్ట పాలనకు అంతమేనని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. రాజోలులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిలకలూరిపేటలో ఏవైపు చూసినా జన సంద్రాన్ని తలపించేలా లక్షల్లో జనం పోటెత్తారన్నారు. జగన్‌రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. జగన్ పాలన ఆర్థిక దుర్వినియోగం, అవినీతికి మారుపేరుగా మారిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

నేడు గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మవారి కల్యాణం



అంతర్వేది, మార్చి 18: కేశవదాసుపాలెం మొండుపాలెంలో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారి ప్రభ ఊరేగింపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి 10.30గంటలకు గోకర్ణేశ్వరస్వామి-జలదుర్గమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. చినకొల్లేరుగా పేరొందిన పెద్దింట్లమ్మవారి తీర్థ మహోత్సవాలు నెల రోజులు వైభవంగా జరుగుతాయి. చలువ పందిళ్లు, తాగునీరు, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు భారీ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా రుద్రహోమం

ఐ.పోలవరం, మార్చి 18: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్ర సందర్భంగా రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో హోమం జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాధన నిర్వహించారు. హోమం అనంతరం పూర్ణాహుతి జరిగింది. ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పురోహితులు నాగభట్ల కృష్ణమూర్తి, శ్రీరామ్‌శర్మ పాల్గొన్నారు.

శివాలయంలో అన్నసమారాధన

మలికిపురం, మార్చి 18: మోరి శ్రీసీతారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పరిసర గ్రామాల నుంచి తరలివచ్చి స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

బ్రహ్మోత్సవాల్లో మాజీ మంత్రి దంపతులు

ఆత్రేయపురం, మార్చి 18: ఆత్రేయపురంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన సోమవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సుదర్శన హోమాలను ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ఘనంగా నిర్వహించారు. మహా సుదర్శన హోమంలో మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుర్తుతెలియని వ్యక్తి ఫిట్స్‌తో మృతి

కాకినాడ రూరల్, మార్చి 18: కొవ్వాడలోని షిరిడీ సాయిబాబా గుడికి సమీపంలో 60ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి ఫిట్స్‌తో మృతిచెందినట్టు ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. శరీరంపై ఖాకీ రంగు చొక్కా, నీలి రంగు నైట్ ఫ్యాంట్, చొక్కాపై గౌతమ్ అనే ఇంగ్లీషు అక్షరాలు ఉన్నాయన్నారు. వివరాలు తెలిస్తే 9440796555 నెంబర్‌కు తెలపాలన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడింది

ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

రావులపాలెం, మార్చి 18: జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. రావులపాలెంలోని కాంగ్రెస్ నాయకులు రౌతు ఈశ్వరరావు(కాశీ)ఆధ్వర్యంలో కొత్తపేట నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జంగా గౌతమ్, డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా వస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి మాచవరపు శివన్నారాయణ, ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణ, కుప్పాల రాం బాబు, సంగీత సత్యనారాయణ, కొప్పిశెట్టి శ్రీనివాస్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

గుడిగళ్లభాగలో బోస్ పర్యటన

కె.గంగవరం, మార్చి 18: గుడిగళ్లభాగలో రాజ్యసభ సభ్యుడుపిల్లి సుభాష్ చంద్రబోస్ పర్యటించారు. ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు ఆధ్వర్యంలో పలు సంఘాల నాయకులను కలిసి మద్దతు ఇవ్వాలనికోరారు. ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, పెట్టా శ్రీనివాసరావు, బత్తుల అప్పారావు పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.2.80లక్షలు

ఆత్రేయపురం, మార్చి 18: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,80,560 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

బోడసకుర్రు వంతెనపై ప్రమాదం

మామిడికుదురు, మార్చి 18: బోడసకుర్రు వంతెనపై పాశర్లపూడి నుంచి బోడసకుర్రు గ్రామానికి చెందిన మొగలి రవి అమలాపురం నుంచి వస్తున్న రెడ్డి వీరవెంకటసత్యనారాయణ-గౌరీపార్వతిలను ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. వీరిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు నగరం పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సూర్యప్రకాష్ పర్యటన

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 18: రామచంద్రపురం 28వవార్డు సూర్యనగర్‌లో సోమవారం వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ పర్యటించారు. ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్, వైస్‌చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, వైసీపీ నాయకులు గుత్తుల వీరన్నశెట్టి, కుడుపూడి భీమశంకరం, దంగేటి సూరిబాబు, యనమదల సుబ్రహ్మణ్యం, యనమదల మల్లి పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు, మార్చి 18: మండలంలోని పెదపళ్ల బ్యాంక్ ఆఫ్ బరోడా సెంటర్లోని రామాలయంలో బుధవారం నూతన విగ్రహాల ప్రతిష్ఠకు భారీ ఏర్పాట్లు చేశారు. సోమవారం విగ్రహాలకు వేదపండితుడు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో పండితులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు.

వేంకటేశ్వరస్వామికి చినశేష వాహనోత్సవం

రావులపాలెం, మార్చి 18: రావులపాలెంలోని శ్రీఅలమేలుమంగ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం చినశేష వాహనోత్సవం జరిగింది. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామ పూజలను వైభ వంగా జరిపారు. భక్తులు, గోవిందమాలధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కోడూరుపాడులో అగ్నిప్రమాదం

అల్లవరం, మార్చి 18: కోడూరుపాడు దేశికోడు వంతెన వద్ద అగ్ని ప్రమాదం జరిగింది. కొత్తపల్లి జగన్నాథరాజుకు చెందిన ఆక్వాచెరువుల వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పాక, మోటారుసైకిల్ దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలను అదుపుచేశారు.

ఫ్లెక్సీ తొలగింపు.. ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అంబాజీపేట, మార్చి18: కె.పెదపూడి రావులమ్మ ఆలయం సమీపంలో అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీని సోమవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ఫ్లెక్సీలను తొలగించని అధికారులు అనే కథనానికి అధికారులు స్పందించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: మాయ
వెంకటరమణ	: వెయ్ దరువెయ్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్ర్కీన్-1	: తంత్ర
శేఖర్ స్ర్కీన్-2	: హనుమాన్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: భీమా
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: భీమ